# ముడా కుంభకోణంలో కొత్త కోణం

- అసలు రైతుకు దక్కింది కేవలం రూ.5.95 లక్షలే
- ప్రతిగా సీఎం సిద్ధరామయ్య కుటుంబానికి ముడా కట్టబెట్టిన ప్లాట్ల విలువ 65 కోట్లు
- ప్లాట్ల కేటాయింపు నిర్ణయంలో యతీంద్ర కీలక పాత్ర?
- సిద్ధరామయ్య కుటుంబానికి అనుచిత ప్రయోజనం నిజమే!
- ముడా కుంభకోణాన్ని బలపరుస్తున్న పత్రాలు




బెంగళూరు, ఆగస్టు 29: ముడా భూకేటాయింపు కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరింత లోతుల్లోకి కూరుకుపోతున్నారు. ఈ వ్యవహారంలో సిద్ధరామయ్య కుటుంబం భారీగా లబ్ధి పొందిందనే ఆరోపణలు బలపడుతున్నాయి. ఈ ఆరోపణలను నిరూపించేలా పత్రాలు ఉన్నాయని 'రిపబ్లిక్' మీడియా సంస్థ ఓ కథనం ప్రసారం చేసింది. దీని ప్రకారం.. సిద్ధరామయ్య భార్య పార్వతి నుంచి కేసరి అనే గ్రామంలో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) 3.16 ఎకరాలు సేకరించింది. ఈ స్థలాన్ని పార్వతి సోదరుడు మల్లికార్జున ఓ రైతు వద్ద 2004లో కొనుగోలు చేశారని, 2005లో పార్వతికి బహుమతిగా ఇచ్చినట్టు రికార్డులు చెప్తున్నాయి. కాగా, ఈ స్థలం అసలు యజమాని అయిన రైతుకు కేవలం రూ.5.95 లక్షలు మాత్రమే ఇచ్చి కొనుగోలు చేశారు. ఈ భూమిని ముడాకు ఇచ్చి ప్రతిగా ఖరీదైన ప్రాంతంలో పార్వతి అందుకున్న స్థలాల విలువ ఇప్పుడు అక్షరాలా రూ.65 కోట్లు.

**ఖరీదైన ప్రాంతాల్లో స్థలాల కోసం లేఖ**

ఎక్కడ స్థలం కావాలనేది తన భార్య ముడాను కోరలేదని ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. అయితే, ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్న ఒక లేఖ బయటకు వచ్చింది. కేసరి గ్రామంలో ఇచ్చిన భూమికి బదులుగా తనకు ఫలానా ప్రాంతాల్లో స్థలాలను కేటాయించాలని కోరుతూ 2014లో సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముడాకు పార్వతి లేఖ రాశారు. స్థలాలు కావాలని లేఖలో పేర్కొన్నవి ఖరీదైన ప్రాంతాలు. అయితే, లేఖలో పేర్కొన్న ప్రాంతాల పేర్లను తర్వాత వైట్‌నర్‌తో తుడిపేశారు. కాగా, పార్వతికి స్థలాన్ని కేటాయించేందుకు 3,500 స్థలాలు ఉన్నప్పటికీ ఖరీదైన విజయనగర్‌లోనే ముడా కేటాయించిందనే విషయం ఆర్టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ స్థలాన్ని కేటాయిస్తూ 2020లో నిర్ణయం జరిగిన ముడా సమావేశంలో సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర ఎమ్మెల్యే హోదాలో పాల్గొన్న విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సిద్ధరామయ్యపై ఆరోపణలు బలపడుతున్నాయి.

## ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రభుత్వ పథకాల ప్రచారం

### కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం

బెంగళూరు: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాటలోనే కర్ణాటక కాంగ్రెస్ సర్కారు నడుస్తున్నది. సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించాలని సిద్ధరామయ్య సర్కారు నిర్ణయించింది. వీరందరికీ ప్రభుత్వ ప్రచారంలో భాగంగా బ్రాండ్ అంబాసిడర్‌షిప్‌లు, స్పాన్సర్డ్ పోస్టులు, అతిథి పాత్రలు, థీమ్, హ్యాష్‌టాగ్ ప్రచారాలు, షౌటవుట్లు, రివ్యూలు, ఈవెంట్ ప్రచార బాధ్యతలు అప్పగిస్తారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, లింక్డ్‌ఇన్, వాట్సాప్‌ల్లో లక్ష కంటే ఎక్కువ ఫాలోవర్లు ఉన్న వారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

## వాల్మీకి స్కామ్‌లో ఈడీ దాడులు

బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్ని కుదిపేస్తున్న 'వాల్మీకి కార్పొరేషన్ స్కామ్'లో ఈడీ అధికారులు మాజీ మంత్రి బీ నాగేంద్ర బంధువులు, అనుచరుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. బళ్లారి, కొప్పాల్, రాయ్‌చూర్‌లో తనిఖీలు చేపట్టారు. బళ్లారిలో నాగేంద్ర బంధువు టీ యెర్రిస్వామి, సహాయకుడు విజయ్‌కుమార్‌ల నివాసాల్లో అధికారులు సోదాలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టర్ జశ్వంత్ రెడ్డిపైనా ఈడీ దాడులు జరిపినట్టు తెలిసింది. వాల్మీకి కుంభకోణం కేసులో చార్జిషీట్ దాఖలు చేసే సమయం వచ్చిందని, దీంతో సోదాల్ని ఉధృతం చేసినట్టు సంబంధిత అధికారులు చెప్పారు.

# రెండెకరాలు అడిగితే ఐదెకరాలు అప్పగింత!

- మల్లికార్జున ఖర్గే ట్రస్టుపై కర్ణాటక సర్కారు ప్రేమ
- ఖరీదైన ప్రాంతంలో ఐదెకరాల స్థలం కేటాయింపు
- మిగతా దరఖాస్తులన్నీ పక్కనపెట్టి మరీ సంతర్పణ
- ట్రస్టు ప్రతిపాదనపైనా వ్యక్తమవుతున్న అనుమానాలు
- రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టే ప్రమోటర్లు ఎవరు?

బెంగళూరు, ఆగస్టు 29: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సిద్ధార్థ విహార్ ట్రస్టుకు భూకేటాయింపు వివాదం రాజకీయ దుమారం రేపుతున్నది. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబానికి చెందిన ఈ ట్రస్టుకు భూ కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కిందని, అర్హతలు చూడకుండా ప్రభుత్వం భూమి కేటాయించిందనే విమర్శలు తీవ్రమవుతున్నాయి. ఈ ఆరోపణలను బలపరిచే అంశాలు క్రమంగా వెలుగులోకి వస్తున్నాయి. అడిగిన విస్తీర్ణం కంటే ఎక్కువ భూమిని కేటాయించడం, మిగతా దరఖాస్తులను పక్కనపెట్టేసి ఒకే దరఖాస్తును పరిగణనలోకి తీసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే ముడా భూకేటాయింపు, వాల్మీకి బోర్డు కుంభకోణాలతో సతమతమవుతున్న కాంగ్రెస్ సర్కారు ప్రతిష్ఠను ఈ ఆరోపణలు మరింత పలుచన చేస్తున్నాయి.

**ఎక్కువ స్థలాన్ని కేటాయించడంపై ఆరోపణలు**

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఆయన భార్య, కుమారులు, అల్లుడు సభ్యులుగా ఉన్న సిద్ధార్థ విహార్ ట్రస్టుకు బెంగళూరు సమీపంలోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్క్‌లో ప్రజా వసతులు కల్పించడానికి ఉద్దేశించిన 45.94 ఎకరాల స్థలంలో 5 ఎకరాల స్థలాన్ని కర్ణాటక పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి బోర్డు(కేఐఏడీబీ) కేటాయించింది. మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పెట్టేందుకు భూమి కావాలని ఈ ట్రస్టు దరఖాస్తు చేసుకుంది. 2.17 ఎకరాల ప్లాటు లేదా 5 ఎకరాల మరో ప్లాటు కేటాయించాలని ఈ ట్రస్టు రెండు ప్రతిపాదనలు పెట్టింది. చిన్న స్థలం అయినా సరిపోతుందని అడిగినప్పటికీ కేఐఏడీబీ మాత్రం పెద్ద స్థలం కేటాయించడం ఇప్పుడు వివాదంగా మారింది. ఈ స్థలాన్ని కేటాయించిన రాష్ట్రస్థాయి సింగిల్ విండో క్లియరెన్స్ కమిటీకి చైర్మన్‌గా మంత్రి ఎంబీ పాటిల్ ఉన్నారు. ఈ భూకేటాయింపులో బంధుప్రీతి, పక్షపాతం ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




రాహుల్ ఖర్గే, రాష్ట్ర పరిశ్రమల మంత్రి పాటిల్, ప్రియాంక్ ఖర్గే, మల్లిఖార్జున్ ఖర్గే

**ప్రమోటర్ల వివరాలపై గోప్యత**

ఈ స్థలంలో మల్టీ స్కిల్ డివలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి రూ.25 కోట్ల వ్యయం అవుతుందని ఈ ట్రస్టు సమర్పించిన ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొన్నది. ఇందులో రూ.10 కోట్లు ప్రమోటర్లు పెట్టుబడి పెడతారని, మరో రూ.10 కోట్లు బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటామని, రూ.5 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా పెడతామని ట్రస్టు పేర్కొన్నది. అయితే, రూ.10 కోట్లు పెట్టుబడి పెట్టే ప్రమోటర్లు ఎవరనే విషయాన్ని వెల్లడించకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సెంటర్‌లో యువతకు ఆటోమొబైల్, సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామని ట్రస్టు పేర్కొన్నది. అయితే, ఈ రంగంలో ట్రస్టుకు ఉన్న అనుభవానికి సంబంధించిన ఆధారాలను మాత్రం సమర్పించలేదని దినేశ్ కల్లహళ్లి అనే సామాజిక కార్యకర్త ఆరోపించారు. మిగతా దరఖాస్తులు అన్నింటినీ పక్కనపెట్టి కేవలం ఈ ఒక్క ట్రస్టు దరఖాస్తును మాత్రమే కమిటీ పరిగణనలోకి తీసుకున్నదని, ఇది బంధుప్రీతి, అవినీతి అని దినేశ్ పేర్కొన్నారు.

## కర్ణాటకలో బీర్ల ధరలు రూ.30 పెంపు!

బెంగళూరు, ఆగస్టు 29: కర్ణాటకలో బీరు తాగేవాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇవ్వబోతున్నది. రాష్ట్రంలో బీర్ల ధరల్ని రూ.10 నుంచి రూ.30 వరకు పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్టు ప్రముఖ ఆంగ్ల దినపత్రిక వార్తా కథనం పేర్కొన్నది. బీర్ల బ్రాండు, ఆల్కహాల్ కంటెంట్‌ను బట్టి ధరల పెంపు ఉంటుంది. త్వరలో బెంగళూరులో నల్లా చార్జీలు పెంచబోతున్నట్టు ఇటీవల డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బీర్ల చార్జీలు కూడా పెంచనున్నట్టు వార్తలు వెలువడటంతో కాంగ్రెస్ సర్కారుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాల నుంచి నీళ్ల వరకు అన్ని ధరలను సిద్ధరామయ్య సర్కారు పెంచుతున్నదని ప్రజలు మండిపడుతున్నారు.



## న్యాయ కోవిదుడు ఏజీ నూరానీ కన్నుమూత

ముంబై: ప్రముఖ విద్యావేత్త, రచయిత, న్యాయ కోవిదుడు అబ్దుల్ గఫూర్ మజీద్ నూరానీ (94) గురువారం ముంబైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన 1930 సెప్టెంబరు 16న ముంబైలో జన్మించారు. ఆయన బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రాక్టీస్ చేశారు. ఆయన 'ది కశ్మీర్ డిస్ప్యూట్ 1947-2012', 'ఆర్టికల్ 370 : ఏ కాన్‌స్టిట్యూషనల్ హిస్టరీ ఆఫ్ జమ్ము అండ్ కశ్మీర్', 'ది డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్' వంటి పుస్తకాలు రాశారు. అంతేకాకుండా జాతీయ, ప్రాంతీయ వార్తా పత్రికల్లో వ్యాసాలు కూడా రాశారు. భారతీయ ముస్లింలకు సంబంధించిన అంశాల గురించి కూడా ఆయన రచనలు చేశారు. నూరానీ మృతి పట్ల జమ్ముకశ్మీరు మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, హురియత్ కాన్ఫరెన్స్ చీఫ్ మీర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్, ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు సంతాపం ప్రకటించారు.

# గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరించొచ్చు

- క్యాబినెట్ సూచనతో వెనక్కు తగ్గాల్సిన అవసరం లేదు
- సిద్ధరామయ్యపై విచారణకు అనుమతిపై హైకోర్టు వ్యాఖ్య
- ముడాస్కామ్‌లో కీలక పరిణామం




బెంగళూరు, ఆగస్టు 29: ముడా భూకేటాయింపు కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేందుకు అనుమతించడం గవర్నర్ స్వతంత్ర నిర్ణయమని, దీనిపై మంత్రివర్గ సూచనతో వెనక్కు తగ్గాల్సిన అవసరం లేదని కర్ణాటక హైకోర్టు వ్యాఖ్యానించింది. సిద్ధరామయ్య భార్య పార్వతి నుంచి మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) తక్కువ విలువైన స్థలాన్ని సేకరించి ఖరీదైన స్థలాన్ని కట్టబెట్టిందనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ అంశంలో సిద్ధరామయ్యను విచారించేందుకు ఆగస్టు 17న గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అనుమతించారు. అయితే, రాష్ట్ర మంత్రివర్గం అనుమతి తీసుకోకుండా గవర్నర్ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని, వీటిని కొట్టేయాలని సిద్ధరామయ్య హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం సిద్ధరామయ్య పిటిషన్ విచారణ సందర్భంగా మంత్రివర్గ నిర్ణయంపై ఆధారపడాల్సిన అవసరం లేదని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణను శనివారానికి వాయిదా వేసింది.

**సిద్ధరామయ్య భార్యపై ఫిర్యాదు**

ముడా భూకేటాయింపు కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతిపై లక్ష్మిపుర పోలీస్‌స్టేషన్‌లో స్నేహమయి కృష్ణ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో కీలకమైన డాక్యుమెంట్‌లో మార్పులు చేశారని పార్వతితో పాటు ముఖ్యమంత్రి సన్నిహితుడు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎం లక్ష్మణపై ఫిర్యాదు ఇచ్చారు. అయితే, పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు. విజయనగర్ లేఅవుట్‌లోని ఖరీదైన ప్రాంతంలో భూమిని కేటాయించాల్సిందిగా ముడాను పార్వతి అడిగారని, ఈ లేఖ బయటకు వచ్చిన తర్వాత దేవనూరు లేదా మరో ప్రాంతంలో స్థలం అడిగినట్టుగా లేఖను మార్చారని స్నేహమయి కృష్ణ ఆరోపించారు.

## అక్రమాస్తుల కేసులో డీకేకు ఊరట

### సీబీఐ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

బెంగళూరు, ఆగస్టు 29: అక్రమాస్తుల కేసులో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ఊరట లభించింది. ఆయనపై సీబీఐ దర్యాప్తునకు అనుమతిని ఉపసంహరిస్తూ కాంగ్రెస్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది. ఈ కేసును లోకాయుక్తకు అప్పగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కూడా తోసిపుచ్చింది. ఈ అంశాలను సుప్రీంకోర్టు పరిష్కరించాలని పేర్కొంది. డీకే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలు రావడంతో, అప్పటి బీజేపీ ప్రభుత్వం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. సిద్ధరామయ్య ప్రభుత్వం సీబీఐకి అనుమతిని ఉపసంహరించింది.




## మహిళల భద్రత కోసం షీ-బాక్స్ పోర్టల్

న్యూఢిల్లీ: పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం షీ-బాక్స్ (SHe-Box) పోర్టల్‌ను ప్రారంభించింది. దీనిని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి గురువారం ప్రారంభించారు. మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఇంటర్నల్ కమిటీలు, స్థానిక కమిటీలకు సంబంధించిన సమాచారం దీనిలో ఉంటుందని ఈ మంత్రిత్వ శాఖ తెలిపింది. బాధితురాళ్లు ఈ పోర్టల్ ద్వారా లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయవచ్చు, దర్యాప్తు ఏ విధంగా జరుగుతున్నదో తెలుసుకోవచ్చు, సకాలంలో తమ సమస్యల పరిష్కారం జరిగేలా చేయవచ్చు. పని చేసే చోట జరిగే లైంగిక వేధింపుల ఫిర్యాదుల పరిష్కారానికి సమగ్ర వేదికగా ఇది పని చేస్తుందని అన్నపూర్ణ దేవి చెప్పారు.

# బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన?

- ఇటీవలి పరిణామాలతో జోరుగా ఊహాగానాలు
- మమతపై అమిత్ షాకు రాష్ట్ర బీజేపీ ఫిర్యాదు
- రాష్ట్రపతి పాలన కోసం ఆ పార్టీ డిమాండ్
- హత్యాచార ఘటనపై స్పందించిన రాష్ట్రపతి

కోల్‌కతా, ఆగస్టు 29: పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన దిశగా అడుగులు పడుతున్నాయా? ఇటీవలి వరుస పరిణామాలు ఈ ఊహాగానాలను బలపరుస్తున్నాయి. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన తర్వాత రాష్ట్రంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఘటనను నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు 21 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. అసాధారణరీతిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఈ ఘటనపై స్పందించారు. బాధితురాలికి న్యాయం జరగాలంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించడం, పోలీసులు కఠినంగా వ్యవహరించడం రాష్ట్రంలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. మరోవైపు బెంగాల్ తగలబడితే ఢిల్లీ సహా పలు రాష్ట్రాలు తగలబడతాయని సీఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందిస్తున్నది. ఇవి దేశవ్యతిరేక వ్యాఖ్యలని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సరైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ ఫిర్యాదు చేశారు.



**రాష్ట్రపతి పాలనకు బీజేపీ పట్టు**

ప్రతిపక్ష నేత సువేందు అధికారి సైతం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని పదేపదే కోరుతున్నారు. ఇటీవల బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి, హోంమంత్రిని కలిశారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. 'గవర్నర్‌గా అన్నీ చూస్తున్నా. నా నిర్ణయాలు ప్రజల్లో చెప్పడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్రంలో పరిస్థితులు, అసాధారణంగా ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకులు గవర్నర్‌ను కలిసి రాష్ట్రాన్ని, ప్రజల హక్కులను కాపాడేందుకు సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వరుస పరిణామాలను పరిశీలిస్తున్న విశ్లేషకులు బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు.

### కాల్ రికార్డుల కలకలం

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనను దాచిపెట్టేందుకు దవాఖాన వర్గాలు ప్రయత్నించిన తీరు కాల్ రికార్డింగులతో బయటకొచ్చింది. ఘటన జరిగిన ఆగస్టు 9న బాధితురాలి తండ్రికి ఆర్జీ కర్ వైద్య కళాశాల, దవాఖాన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఫోన్ చేశారు. 'మీ కూతురికి ఆరోగ్యం బాగోలేదు. మేము దవాఖానలో చేరుస్తున్నాం. మీరు దవాఖానకు రండి' అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే మరోసారి ఫోన్ చేసి 'మీ అమ్మాయి పరిస్థితి విషమంగా ఉంది. ఆమె ఆత్మహత్యాయత్నం చేసుకొని ఉండవచ్చు. మీరు త్వరగా రండి' అంటూ చెప్పాడు. తర్వాత కొంతసేపటికే మరోసారి ఫోన్ చేసి..'మీ అమ్మాయి ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్టుంది.' అంటూ మరణవార్తను చెప్పారు.

మరోవైపు, 'బెంగాల్ తగలబడితే ఢిల్లీ కూడా తగలబడుతుందని గుర్తుంచుకోండి' అంటూ మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యపై ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు న్యాయవాది వినీత్ జిందాల్ ఫిర్యాదు చేశారు.

## ఎంపీలో దళిత మహిళపై దాష్టీకం

- మహిళను, కుమారుడ్ని చితకబాదిన పోలీసులు
- 10 నెలల తర్వాత విచారణకు ప్రభుత్వం ఆదేశం



భోపాల్, ఆగస్టు 29: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో పోలీసుల తీరు వివాదాస్పదంగా మారింది. ఓ దళిత మహిళ, ఆమె కుమారుడ్ని(15) పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన అక్కడి సిబ్బంది, వాళ్లిద్దర్నీ చితకబాదారు. కుమారుడి కండ్లెదుట దళిత మహిళను జుట్టు పట్టుకొని కిందపడేసి కొట్టారు. ఈ ఘటన దాదాపు 10 నెలల క్రితం జరిగినట్టు తెలిసింది. ఇంతకాలం ఈ విషయం అందరికీ తెలియకుండా కప్పిపెట్టేందుకు సీఎం మోహన్ యాదవ్ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ ప్రయత్నించిందని ఆరోపణలు వెలువడుతున్నాయి. కాట్ని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయటంతో, ప్రభుత్వం డీఐజీ స్థాయి అధికారితో విచారణకు ఆదేశించింది. సదరు పోలీస్ స్టేషన్ సిబ్బంది తీరు ఒళ్లు జలదరించేలా ఉందని, శాంతి భద్రతల పేరుతో గూండాయిజం ప్రదర్శిస్తున్నారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పది నెలల దాకా.. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని నెటిజన్లు విమర్శించారు.

## యూపీలో ఆపరేషన్ భేడియా

- భరూచ్‌లో తోడేళ్ల దాడిలో ఏడుగురి మృతి
- వాటిని బంధించేందుకు ప్రత్యేక ఆపరేషన్



బహ్రెయిచ్: ఉత్తరప్రదేశ్‌లోని భరూచ్‌లో పలు గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న తోడేళ్లను పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ భేడియా చేపట్టింది. తోడేళ్ల దాడిలో ఇటీవల ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ప్రభుత్వం ఇప్పటివరకు నాలుగు తోడేళ్లను పట్టుకున్నది. బారాబంకీ డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్, 'ఆపరేషన్ భేడియా' ఇన్‌చార్జి ఆకాశ్‌దీప్ బధవాన్ మాట్లాడుతూ, సిసయ్య చూడామణి గ్రామం సమీపంలో తాము ఏర్పాటు చేసిన వలల్లో ఒక మగ తోడేలు పడిందన్నారు. అయితే ఈ ప్రాంతంలో ఎన్ని తోడేళ్లు తిరుగుతున్నాయో స్పష్టంగా తెలియడం లేదని అధికారులు చెప్తున్నారు.

## గురుగ్రామ్‌లో సౌతాంప్టన్ వర్సిటీ క్యాంపస్

### ఎన్‌ఈపీ కింద తొలి విదేశీ విశ్వవిద్యాలయం ఇదే..

న్యూఢిల్లీ: నూతన జాతీయ విద్యా విధానం కింద తొలి విదేశీ విశ్వవిద్యాలయం ఆఫ్‌షోర్ క్యాంపస్ గురుగ్రామ్‌లో ఏర్పాటు కాబోతున్నది. బ్రిటన్‌కు చెందిన సౌతాంప్టన్ వర్సిటీ దీనిని ఏర్పాటు చేస్తుందని కేంద్రం గురువారం తెలిపింది. దీనికి సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ని విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ వర్సిటీ ప్రతినిధులకు అందజేశారు. మన దేశంలోని సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఇచ్చే డిగ్రీలు బ్రిటన్‌లో ఆ విశ్వవిద్యాలయం ఇచ్చే డిగ్రీలతో సమానమైనవేనని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ చెప్పారు. విద్య, నాణ్యత ప్రమాణాలు సమానంగా ఉంటాయన్నారు.

## పాక్ గూఢచర్యం కేసులో ఎన్ఐఏ సోదాలు

### తెలంగాణ సహా 7 రాష్ట్రాల్లో తనిఖీలు

హైదరాబాద్, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ): పాక్ గూఢచర్యం కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బుధవారం తనిఖీలు చేపట్టింది. తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా రాష్ట్రాల్లో మొత్తం 16 చోట్ల సోదాలు నిర్వహించినట్టు తెలిపింది. భారత నౌకాదళానికి చెందిన కీలక సమాచారాన్ని తెలుసుకునేందుకు పాకిస్థాన్ పన్నిన కుట్ర విశాఖపట్నం వేదికగా 2021లో వెలుగు చూసింది. ఏపీకి చెందిన కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టింది.

## ముస్లింల వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి


### బిల్లుకు అస్సాం అసెంబ్లీ ఆమోదం

గువాహటి: ముస్లింల వివాహ, విడాకుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అస్సాం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండింటి నమోదును తప్పనిసరి చేస్తూ అస్సాం శాసనసభ గురువారం బిల్లును ఆమోదించింది. సీఎం హిమంత మాట్లాడుతూ, గతంలో ఖాజీలు నిర్వహించిన వివాహాలు చెల్లుబాటు అవుతాయని, కొత్త చట్టం అమలులోకి వచ్చిన నాటి నుంచి వివాహాలను వారు నమోదు చేయరాదని, తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద రిజిస్ట్రేషన్ చేయాలని అన్నారు.



## నేవీ అమ్ములపొదిలోకి ఐఎన్ఎస్ అరిఘాత్

న్యూఢిల్లీ, ఆగస్టు 29: అణ్వస్త్ర సామర్థ్యమున్న 'ఐఎన్ఎస్ అరిఘాత్' నేవీ అమ్ములపొదిలోకి చేరింది. ఏపీలోని విశాఖపట్నంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో జలాంతర్గామిని ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. భారత నౌకాదళంలో ఐఎన్ఎస్ అరిఘాత్ రెండో అణు జలాంతర్గామి అని, దీని ప్రవేశంతో దేశ అణు సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందన్నారు. తొలి అణు జలాంతర్గామి అరిహంత్‌ను 2016లో ప్రారంభించారు. దానికి అడ్వాన్స్‌డ్ వెర్షన్‌గా మరిన్ని ఆధునిక హంగులతో అరిఘాత్‌ను నిర్మించారు. ఐఎన్ఎస్ అరిఘాత్ సముద్ర ఉపరితలంపై గంటకు 12-15 నాటికల్ మైళ్ల వేగంతో, సముద్ర అంతర్భాగంలో గంటకు 24 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించగలదు.




## స్మార్ట్‌ఫోన్ వ్యసనానికి విరుగుడు

లండన్, ఆగస్టు 29: స్మార్ట్‌ఫోన్ వ్యసనాన్ని తగ్గించే సరికొత్త ఫోన్‌ను హెచ్‌ఎండీ అనే యూరోపియన్ ఫోన్ల తయారీ కంపెనీ తయారు చేసింది. అయితే ఈ ఫోన్‌లో స్మార్ట్‌ఫోన్‌లో ఉండే ఫీచర్లు ఏమీ ఉండవు. వాట్సాప్, సోషల్ మీడియా యాప్‌లు ఇందులో కనిపించవు. అసలు ప్లే స్టోర్ అనేదే ఈ ఫోన్‌లో ఉండదు. టచ్‌స్క్రీన్ బదులు కీప్యాడ్ ఉంటుంది. సెల్ఫీలు దిగేందుకు ఫ్రంట్ కెమెరా ఉండదు. కేవలం ఒకే ఒక్క మామూలు వీడియో గేమ్ మాత్రమే ఉంటుంది. మొబైల్ ఇంటర్నెట్ కూడా చాలా తక్కువ స్పీడ్‌తో మాత్రమే వస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే తొలుత కనీస ఫీచర్లతో ఫోన్‌లు ఎలా ఉండేవో ఈ ఫోన్ కూడా అలానే ఉంటుంది. ప్రస్తుతం దాదాపు రూ.11 వేల ధరకు ఈ ఫోన్ యూకే, యూరోప్‌లో అందుబాటులోకి వచ్చింది.



## రాత్రివేళ సూర్యకాంతి విక్రయిస్తాం!

కాలిఫోర్నియా, ఆగస్టు 29: రాత్రివేళ సైతం సూర్యకాంతిని అందిస్తామని చెప్తున్నది కాలిఫోర్నియాకు చెందిన రిఫ్లెక్ట్ ఆర్బిటల్ అనే కంపెనీ. ఈ దిశగా తమ ప్రణాళికలను ఈ సంస్థ సీఈఓ బెన్ నోవాక్ వెల్లడించారు. సహజంగా సౌర విద్యుత్తు సూర్యకాంతి ఉన్నప్పుడే ఉత్పత్తి అవుతుంది. కానీ, ఆ సమయంలో విద్యుత్తు అవసరం తక్కువ. విద్యుత్తు అవసరం ఎక్కువగా ఉండే రాత్రివేళ సౌర విద్యుత్తు ఉత్పత్తి కాదు. ఈ సమస్యకు పరిష్కారంగా రాత్రిపూట కూడా సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసే అవకాశాన్ని కల్పిస్తామని, ఇందుకోసం సూర్య కాంతిని విక్రయిస్తామని నోవాక్ చెప్తున్నారు. ఇందుకు గానూ 57 చిన్న ఉపగ్రహాలను భూమి నుంచి 370 మైళ్ల ఎత్తుకు పంపించనున్నట్టు చెప్పారు. ఈ ఉపగ్రహాలకు ఒక్కోదానికి 33 చదరపు అడుగుల మైలార్ అద్దాలు ఉంటాయి. నింగిలో ఈ అద్దాలపై పడే సూర్యకాంతి భూమిపై ఉండే నిర్దేశిత సౌర ఫలకాలపై ప్రతిబింబించేలా చేస్తామని, తద్వారా సూర్యాస్తమయం తర్వాత సైతం విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఉంటుందని నోవాక్ తెలిపారు. తాజాగా, హాట్ ఎయిర్ బెలూన్ ద్వారా తమ ఆలోచనను ప్రయోగించి చూపించారు.



## శునకం ఆస్తులు రూ.3,300 కోట్లు!

న్యూఢిల్లీ: శునకానికి ఏకంగా రూ.3,300 కోట్ల ఆస్తి ఉందంటే నమ్మగలరా? ఈ ఫొటోలో కనిపిస్తున్న జర్మన్ షెఫర్డ్ శునకం పేరు గుంథెర్-6. రూ.3వేల కోట్లకు పైగా ఆస్తులతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న శునకంగా ఇది గిన్నిస్ రికార్డులకెక్కింది. దీనికి ఓ విమానం, యాట్ సహా బీఎండబ్ల్యూ కారు ఉన్నాయి. దీని సేవలకు 27 మంది సిబ్బంది, రుచికరమైన ఆహారాన్ని సిద్ధం చేయడానికి ఓ చెఫ్ కూడా ఉన్నారు. కర్లోటా లీబెన్‌స్టీన్ కుమారుడు 1992లో మరణించడంతో తన ఆస్తినంతటినీ గుంథెర్-3 పేరు మీద రాశారు. ఈ ఆస్తుల నిర్వహణ బాధ్యతలను తన ఇటాలియన్ స్నేహితుడు మౌరిజియో మియాన్‌కు అప్పగించారు. మియాన్ ఈ ఆస్తులను విపరీతంగా పెంచడంతో గుంథెర్-6కు కళ్లు చెదిరే స్థాయిలో ఆస్తులు సంక్రమించాయి.